

సందడిగా 'స్పిక్ మైకే' సదస్సు



పళ్లెంపై కూచిపూడి నృత్యం



● ఆకట్టుకున్న కూచిపుడి నృత్య ప్రదర్శన ● అలరించిన గుస్సాడి నృత్యం ● ఉర్దూ సాహిత్యంపై షబానా అజ్మీ జావేద్ అక్తర్ చర్చ

కంది, మే 27 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌లో మంగళవారం 'స్పిక్ మైకే' అంతర్జాతీయ సదస్సు రెండో రోజు కొనసాగింది. భారతీయ శాస్త్రీయ కళలలో అత్యుత్తమమైన వాటిలో విద్యార్థులను ముంచెత్తే అనుభవాన్ని ఈ వేడుక పరిచయం చేసింది. మంగళవారం నాడు తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి హఠ యోగ, నాద్ యోగా, ధ్యానం శ్రమదాన్, ఇంటెన్సివ్ వర్క్‌షాప్‌లు జరిగాయి. మధ్యాహ్నం యోగ నిద్ర కార్యక్రమాలు నిర్వహించారు. ఆడిటోరియంలో నృత్యకారిణి చేసిన కూచిపుడి ప్రదర్శన అబ్బురపరిచింది. సాయంత్రం ఆదిలాబాద్ జిల్లాకు చెందిన కనక సుదర్శన్ బృంద సభ్యులు చేసిన గుస్సాడి నృత్యం ఆకట్టుకుంది. సాయంత్రం షబానా అజ్మీ, జావేద్ అక్తర్ ఉర్దూ సాహిత్యంపై నిర్వహించిన చర్చ ఆసక్తి కలిగించింది. అనంతరం బేగం పర్వీన్ సుల్తానా గానం, పండిట్ విశ్వమోహన్ భట్ వీణా వాయిద్యం ఆకట్టుకున్నాయి. ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్‌మూర్తి మాట్లాడుతూ భారతదేశ సాంస్కృతిక, కళాత్మక వారసత్వాన్ని చాటిచెప్పడానికి సదస్సు దోహదం చేస్తుందన్నారు. ఆశ్రమం లాంటి అభ్యాసం, స్వీయక్రమశిక్షణ, ప్రేరణతో కూడిన వాతావరణంలో సంప్రదాయాన్ని యువత శక్తితో మిళితం చేస్తుందని ఆయన వెల్లడించారు. సదస్సుకు స్పిక్ మైకే జాతీయ చైర్‌పర్సన్ ఆర్‌ఎంతివారీ, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కవులు, రచయితలు, సాహితీవేత్తలు, పండితులు, సంగీత విద్వాంసులు, ఐఐటీ హైదరాబాద్ అధ్యాపకులు, విద్యార్థులు, బ్రాహ్మకుమారి సభ్యులు తదితరులు హాజరయ్యారు.



గుస్సాడి నృత్యం చేస్తున్న గోండు కళాకారులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న కార్లు

బెట్టింగ్ గుట్టు రట్టు

ఫామ్‌హౌస్‌పై పోలీసుల దాడి

ఐదు కార్లు, సెల్ ఫోన్లు, నగదు స్వాధీనం

తొమ్మిది మందిపై కేసు నమోదు

హత్నూర, మే 27 (ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌పై ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఫామ్‌హౌస్‌పై పోలీసులు దాడి చేసి బెట్టింగ్ గుట్టు రట్టు చేశారు. హత్నూర మండలం మల్కాపూర్ గ్రామ శివారులోని వీఎస్ఆర్ ఫామ్‌హౌస్‌లో సోమవారం రాత్రి జరిగిన ఈ ఘటన వివరాలను ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి మంగళవారం వెల్లడించారు. బెట్టింగ్ నిర్వహిస్తున్నారన్న నమ్మదగిన సమాచారం మేరకు ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా విభాగం పోలీసులు ఫాంహౌస్‌పై దాడి చేశారు. ఐపీఎల్‌లో పంజాబ్, ముంబై జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌పై త్రో ఏపీకే లింక్‌లో హోమ్‌సైట్‌లో డబ్బులు పెట్టి ఆన్‌లైన్ మ్యాచ్ చూస్తూ బెట్టింగ్ పాల్పడుతున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులను చూసి ముఠా సభ్యులు పారిపోయేందుకు ప్రయత్నించగా పోలీసులు వెంబడించి పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఆన్‌లైన్ బెట్టింగ్ పాల్పడుతున్నవారిలో హైదరాబాద్ మియాపూర్ ప్రాంతానికి చెందిన తుమ్మలి సంగమేశ్వర్, కూకట్‌పల్లి జేఎన్‌టీయూ ప్రాంతానికి చెందిన మస్ పాల్ రాజు, కామారెడ్డి జిల్లా పిట్లం మండలం తిమ్మానగర్ గ్రామానికి చెందిన రేగోడు మణికంఠ, హత్నూర మండలం దౌల్తాబాద్ పట్టణానికి చెందిన వాగుల గడ్డ శ్రీనివాస్‌రెడ్డి, అమీన్‌పూర్ మండలం పటేల్‌గూడ గ్రామానికి చెందిన ఈర్ల భాస్కర్, హత్నూర మండలం కాసాల గ్రామానికి చెందిన మద్దూరి దుర్గయ్య, దౌల్తాబాద్ గ్రామానికి చెందిన హసాజి శ్రీనివాస్, మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్ గ్రామానికి చెందిన చెన్నకృష్ణాగౌడ్, నర్సాపూర్ పట్టణానికి చెందిన పైడి శ్రీనివాస్ ఆన్‌లైన్ బెట్టింగ్ పట్టుబడినవారిలో ఉన్నారని తెలిపారు. వీరి నుంచి ఐదు కార్లు, 13 సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్, టీవీతో పాటు రూ. 5,590 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. తొమ్మిది మందిపై కేసు నమోదు చేయడంతో పాటు అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం నిషేధించిన ఆన్‌లైన్ బిట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడినట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ తెలిపారు.

తాలు.. తరుగు

@ రూ.33 కోట్లు

ధాన్యం కొనుగోళ్లలో నిర్వాహకుల చేతివాటం

ప్రతీ క్వింటాలుకు 5 కిలోలు అధికంగా తూకం

పట్టించుకోని అధికారులు.. నష్టపోతున్న రైతులు



ఆరుగాలం కష్టపడి వరి సాగుస్తున్న రైతు ధాన్యం విక్రయించడంలో దగాకు గురవుతున్నాడు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరిట దోపిడీతో అన్నదాత నిండా మునుగుతున్నాడు. నిబంధనలకు విరుద్ధంగా క్వింటాలుకు ఐదు కిలోల చొప్పున తరుగు తీస్తున్నారని రైతులు వాపోతున్నారు.

.మెదక్, మే 27 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో ఈ యాసంగి సీజన్‌లో సుమారు 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేయడానికి సివిల్ సప్లై శాఖ అధికారులు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. ఐకేపీ, పీఏసీఎస్, డీసీఎంఎస్, ఎఫ్‌పీవోల ఆధ్వర్యంలో 498 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే మూడొంతుల ధాన్యాన్ని సేకరించారు. ఇప్పటికే 125 సెంటర్లలో ధాన్యం కొనుగోళ్లు ముగిసినట్లు అధికారులు ప్రకటించారు. అయితే, ఎక్కడా కేంద్రంలో రైతులు తెస్తున్న ధాన్యాన్ని సరిగా తూకం వేయడంలేదు. రైతులు తెస్తున్న ధానాన్ని క్వింటాలుకు 5 కిలోలు అదనంగా తూకం వేస్తున్నారు. ఇప్పటికే మూడొంతుల ధాన్యాన్ని సేకరించిన నేపథ్యంలో రూ.33 కోట్లు తరుగు పేరిట రైతులు నష్టపోతున్నట్లు తెలుస్తోంది. రైతులకు పెద్దఎత్తున నష్టం జరుగుతోందని తెలుస్తున్నా అధికారులు నిర్లిప్తంగా ఉండడాన్ని రైతులు సహించలేకపోతున్నారు.

ప్యాడీ క్లీనర్లు లేకపోవడంతోనే

జిల్లాలో ఆటోమెటిక్ ప్యాడీ క్లీనర్లను కొనుగోలు కేంద్రాలలో ఏర్పాటు చేయలేదు. కేంద్రానికి ధాన్యాన్ని తెచ్చిన రైతు వడ్లను ఆరబెట్టుకోవడానికి అనుకూల పరిస్థితులు ఉండడంలేదని రైతులు వాపోతున్నారు. ఈ సారి వర్షాలు ముందుగానే కురుస్తుండడంతో వడ్లు వానలకు తడిసి ముద్దవుతున్నాయి. తడిసిన ధాన్యాన్ని పలుమార్లు ఆరబోయాల్సి వస్తోందని మెదక్ పట్టణానికి చెందిన రైతు కిషన్ వాపోయాడు. ఇక కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్ కవర్లు ఇవ్వడం లేదని 'ఆంధ్రజ్యోతి'తో రైతులు మొరబెట్టుకున్నారు. ఈ విషయమై సివిల్‌సప్లై డీఎం జగదీష్ దృష్టికి తీసుకురాగా తాము రైతులకు టార్పాలిన్లు ఇవ్వమనే చెబుతున్నామని తెలిపారు. దీంతో, రైతులు దాయర కేంద్ర నిర్వాహకుడితో వాగ్వాదానికి దిగడంతో ధాన్యాన్ని విక్రయించిన రైతులు టార్పాలిన్లు వాపస్ ఇవ్వలేదని ఆరోపిస్తున్నారు. ప్యాడీ క్లీనర్లు ఏర్పాటు చేయకపోవడంతో వారికి పాలుపోవడంలేదు. రైతులకు తడిసిన వడ్లను ఆరబెట్టుకోవడం ఓ ప్రహసనంగా మారడంతో తప్పేది లేక తూకంలో తరుగు వేస్తున్నా మౌనంగా భరిస్తున్నారు.

సౌకర్యాల కోసం 2 శాతం

పౌరసరఫరాల శాఖ ప్రతీ ఏటా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాలు ఏర్పాటుకు గతంలో ఒక శాతం పన్ను చెల్లిస్తుంది. ఈసారి 2 శాతానికి పెంచారు. అయినప్పటికీ రైతులకు టార్పాలిన్లు, ఆటోమెటిక్ ప్యాడీక్లీనర్లు ఏర్పాటు చేయడంలో అలసత్వం వహించారు. దీన్ని సాకుగా తీసుకున్న కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తరుగు పేరిట ధాన్యం కాజేస్తున్నారు. పైగా అనేక కొనుగోలు కేంద్రాలను బినామీలు నడుపుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఫిర్యాదు చేస్తున్నారు. బాధ్యత లేని బినామీ నిర్వాహకులు రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తగు విచారణ జరిపి రైతుల ధాన్యం కోత విధిస్తున్న నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని, ఈ విషయంలో జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరిపి దోపిడీకి గురైన సొమ్ము తిరిగి ఇప్పించాలని రైతులు కోరుతున్నారు.



చేనుకు చేవ.. వేప

చీడపీడల నివారణకు దోహదం.. వేప పిండి, నూనె అన్నీ ఎరువే..

రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

భూసారం పెంచడమే లక్ష్యం

జీవాల ఎరువుతో జీవం

7

పార్టీలకతీతంగా అభివృద్ధి

మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



7

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

మరో ముగ్గురికి గాయాలు

ఉమ్మడి మెదక్ జిల్లాలో విషాదం

6

మాతాశిశు సంరక్షణ కార్డుల్లేవ్..!

సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా పీహెచ్‌సీల్లో కొరత

రెండు నెలలుగా సమకూర్చని వైద్య ఆరోగ్యశాఖ

జిరాక్స్ కాపీలపైనే రికార్డుల నమోదు



సంగారెడ్డి అర్బన్, మే 27 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో మాతా శిశు సంరక్షణ కార్డుల (ఎంసీపీ-మదర్ అండ్ చైల్డ్ ప్రొటెక్షన్) కొరత ఏర్పడింది. గర్భం దాల్చిన నాటి నుంచి పుట్టిన బిడ్డకు ఐదేళ్లు వచ్చేవరకు సమగ్ర వివరాలతో పాటు వేయించాల్సిన టీకాలు, పాటించాల్సిన జాగ్రత్తలు, సూచనలతో కూడిన ఎంసీపీ కార్డు వైద్య ఆరోగ్య శాఖ ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. జిల్లా వ్యాప్తంగా సుమారు రెండు నెలలుగా ఈ కార్డుల కొరత వేధిస్తున్నది. జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 34 ఉన్నాయి. వీటిల్లో సుమారు నెలకు రెండు వేల మంది గర్భిణులు చికిత్స పొందుతుంటారు. వీరెవరికీ రెండు, మూడు నెలలుగా మాతా శిశు సంరక్షణ కార్డులు అందుబాటులో లేకపోవడంతో జిరాక్స్ తెచ్చుకోవాలని మెడికల్ ఆఫీసర్లు సూచిస్తున్నారని గర్భిణులు వాపోతున్నారు. ఒక్కో కార్డు జిరాక్స్ తీసుకోవాలంటే రూ.50 వరకు వెచ్చించాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనవసర వాటికి మాత్రం ఇతర అకౌంట్ల నిధులను దారి మళ్లించి వాడుకుంటున్న అధికారులు.. గర్భిణుల విషయంలో అత్యంత ముఖ్యమైన విషయాన్ని గుర్తించకపోవడం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నదని పలువురు ఆరోపిస్తున్నారు.



తీరిన చింత..

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తప్పిన 'నీటి తండ్లాట'

మాసాయిపేట, మే 27 (ఆంధ్రజ్యోతి) : మాసాయిపేట మండలం రామంతాపూర్ తండాలో గిరిజనుల తాగునీటి వెతలు తీర్చేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. తండాలో తాగునీటి సమస్యపై మంగళవారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో 'నీటి తండ్లాట' కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో అధికారులు స్పందించి మిషన్ భగీరథ పైపులైన్‌కు మరమ్మతులు చేసి నీటి సరఫరాను పునరుద్ధరించారు. తండాకు నీటి సరఫరాలో సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్లు మిషన్ భగీరథ ఇంజనీర్ సురేష్, ఎంపీడీవో విగ్నేశ్వర్ తెలిపారు.

భూ సేకరణలో వేగం పెంచండి

సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశం

సంగారెడ్డి రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి) :నిమ్జ్, రీజినల్ రింగ్‌రోడ్డు కోసం అవసరమైన భూ సేకరణ ప్రక్రియలో వేగం పెంచాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నిమ్జ్ కోసం ఇప్పటి వరకు సేకరించిన భూమి చుట్టూ కంచె వేయాలని, సూచించారు. రీజనల్ రింగ్‌రోడ్డు, నిమ్జ్ నిర్మాణం పూర్తయితే ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ మాధురి, నిమ్జ్ ప్రత్యేకాధికారి రాజు పాల్గొన్నారు.

కుంటలు చెరబట్టి 'రియల్' దందా

ఐడీఏ బొల్లారంలో దశాబ్దాల క్రితం 23 కుంటలు

ప్రస్తుతం రికార్డుల్లో 15 మాత్రమే

ఎనిమిది కుంటలు మాయం

ఆక్రమణలతో కుంచించుకుపోయిన మరో ఆరు..

దర్జాగా వెంచర్లు వేసి స్థలాల విక్రయం

మిగిలిన 127 ఎకరాల శిఖం భూమికి రక్షణ కరువు



కోమటికుంటలో ఆక్రమణలు

ఐడీఏ బొల్లారం, మే 27 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామికవాడగా పేరున్న ఐడీఏబొల్లారం పురపాలిక పరిధిలో పదుల సంఖ్యలో కుంటలు మాయమయ్యాయి. అక్రమార్కులు దర్జాగా పూడ్చివేసి స్థలాలను అమ్ముకుంటున్నారు. ఐడీఏబొల్లారం పారిశ్రామికవాడలో వేలాది మంది ఇతర రాష్ట్రాల వారు పనిచేస్తూ చుట్టుపక్కల నివాసముంటున్నారు. దీంతో ఇంటి స్థలాలకు డిమాండ్ విపరీతంగా ఉంది. దీంతో, అక్రమార్కులు కుంటలను పూడ్చి ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారు. దశాబ్దాల క్రితం పట్టణంలో 23 కుంటలు ఉండేవని స్థానికులు పేర్కొంటున్నారు. రికార్డుల్లో అధికారులు కుంటల సంఖ్యను మార్చుతూ వెళ్లారు. ప్రస్తుతం 15 కుంటలున్నాయని రికార్డుల్లో ఉంది. ఇందులో ఎనిమిది కుంటలు ఆనవాళ్లు లేకుండా పూర్తిగా మాయమయ్యాయి. మరో ఆరు కుంటలు ఆక్రమణల చెరలో చిక్కుకుని త్వరలో కనుమరుగయ్యే ప్రమాదంలో ఉన్నాయి.

వెయ్యి నంబర్ ప్రత్యేకం

హెచ్ఎండీఏ చెరువుల పరిరక్షణ విభాగం అధికారులు ఈ కుంటలన్నిటికి ప్రత్యేకమైన గుర్తింపు సంఖ్యనే ఇచ్చారు. మున్సిపాలిటీ పరిధిలోని కుంటలకు ప్రత్యేకంగా వెయ్యి నంబరును కేటాయించారు. ప్రతీ కుంటకు బై నంబర్లు ఇచ్చారు. ఉదాహరణకు వర్రకుంటకు 1000/89 అనే నంబరు ఇచ్చారు. ప్రస్తుతం అక్కడ కుంటనే లేదు. ఈ విషయంపై అనేక ఫిర్యాదులు వచ్చినా చర్యలు శూన్యం. రియల్ వ్యాపారులకు వంతపాడుతున్న అధికారులు కుంట ఉండేది ఇక్కడ కాదు మరోచోట.. సర్వే చేస్తామంటూ కాలయాపన చేస్తున్నారు.

127 ఎకరాల శిఖం సురక్షితమేనా?

ఐడీఏబొల్లారంలో అధికారులు చూపుతున్న రికార్డుల ప్రకారం ప్రస్తుతం ఉన్న 15 కుంటల్లో 127 ఎకరాల శిఖం భూమి ఉన్నట్లు రికార్డుల్లో ఉంది. సర్వే నంబర్ల ప్రకారం వెయ్యి.. బై నంబర్ 21, 71, 83, 132, 144, 165, 181, 170, 173, 191, 220, 230, 250, 161, 282లో ఈ శిఖం భూమి ఉండాలి. దీన్ని ప్రభుత్వం ప్రభుత్వ భూమిగా ప్రకటించి రక్షించాల్సిన నీటిపారుదలశాఖ అధికారులు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. కుంటల పరిరక్షణ బాధ్యత, శిఖం భూమి పరిరక్షణను ఆయా శాఖల అధికారులు తమ బాధ్యత కాదనట్లుగా తప్పించుకుంటున్నారు. పెద్దఎత్తున ఇళ్లస్థలాలుగా మార్చి అమ్మకాలు జరుపుతున్న చర్యలు తీసుకోవడానికి అధికారులు ఆసక్తి చూపడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఎండు గంజాయి పట్టివేత... ఒకరి అరెస్టు

నారాయణఖేడ్, మే 27(ఆంధ్రజ్యోతి): ఖేడ్ పట్టణంలోని బసవేశ్వర చౌక్ సమీపంలోఎండు గంజాయిని తరలిస్తున్న ఓ వ్యక్తిని ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ టీం ఎస్‌ఐలు హన్మంతు, అనుదీప్ మంగళవారం నారాయణఖేడ్‌లో వివరాలను వెల్లడించారు. ఈ మేరకు.. ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం రాత్రి ఖేడ్ పట్టణంలోని బసవేశ్వర చౌక్ సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. అదే సమయంలో నాగల్‌గిద్దకు చెందిన శివకుమార్(35) బైక్‌పై బీదర్ నుంచి వస్తుండగా తనిఖీ చేయడంతో, అతడి వద్ద రెండు సంచుల్లో రెండున్నర కిలోల ఎండు గంజాయి లభించింది. అతడిని అరెస్టు చేసి, బైక్‌ను సీజ్ చేసినట్టు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు నిమిత్తం ఖేడ్ ఎక్సైజ్ సీఐ కార్యాలయంలో స్వాధీనం చేసినట్లు తెలిపారు.

రెండేళ్ల కూతురితో వివాహిత అదృశ్యం


అదృశ్యమైన మమత, కూతురు

శివ్వంపేట్, మే 27(ఆంధ్రజ్యోతి): అత్తగారింటికి వెళ్తున్నట్టు తల్లిగారింట్లో చెప్పి 6 రోజుల క్రితం వెళ్లిన వివాహిత రెండేళ్ల కూతురుతో పాటు అదృశ్యమైంది. ఈ ఘటన మండలంలోని శభాష్‌పల్లి గ్రామంలో మంగళవారం ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని శభాష్‌పల్లి గ్రామానికి చెందిన కోట్ల రాజు చిన్న కూతురు బంటు మమత(24) పదిహేను రోజుల క్రితం శభాష్‌పల్లి తల్లిగారి ఇంటికి వచ్చింది. ఈ నెల 21న మధ్యాహ్నం 3 గంటలకు అత్త గారిల్లు అయిన రాయపోల్ మండలం వడ్డేపల్లికి వెళ్తున్నానని చెప్పి రెండేళ్ల కూతురును తీసుకొని వెళ్లింది. అనంతరం తండ్రి అత్తగారింటికి ఫోన్ చేసి అడగగా రాలేదని చెప్పడంతో చుట్టుపక్కల బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధూకర్ రెడ్డి తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

- మరో ముగ్గురికి గాయాలు
- ఉమ్మడి మెదక్ జిల్లాలో విషాదం


ఐడీఏ బొల్లారం వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ


చికిత్స పొందుతూ మృతి చెందిన కార్తీక్, అనిత (ఫైల్)

ఐడీఏ బొల్లారం/శివ్వంపేట/తూప్రాన్, మే 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లాలో చోటు చేసుకున్న వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన ముగ్గురు మంగళవారం మృతి చెందగా మరో ముగ్గురికి గాయాలయ్యాయి. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు ప్రాంతంలోని ఐడీఏ బొల్లారం ఓఆర్ఆర్‌పై ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొన్న ఘటనలో క్లీనర్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మెదక్ జిల్లా శివ్వంపేట మండలంలో ఓ విద్యార్థి, తూప్రాన్ మండలం అల్లాపూర్ శివారులో జరిగిన ఘటనలో మహిళ తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు.

ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొని క్లీనర్..

పంక్చర్ అయిన లారీ టైర్‌ను మారుస్తుండగా వెనుకనుంచి మరో లారీ ఢీకొన్న ఘటనలో క్లీనర్ దుర్మరణం చెందగా, డ్రైవర్‌కు గాయలయ్యాయి. ఈ సంఘటన ఐడీఏబొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం వేకువజామున 5 గంటల ప్రాంతంలో చోటు చేసుకున్నది. సీఐ రవీందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడలోని రైస్‌మిల్లు నుంచి బియ్యం లోడ్‌తో బీదర్‌కు బయలుదేరిన లారీ అవుటర్ రింగ్‌రోడ్‌పై నుంచి వెళ్తుండగా ఐడీఏబొల్లారం వద్దకు చేరుకోగానే టైర్ పంక్చర్ అయింది. క్లీనర్ హిజాజ్ (36)డ్రైవర్ ఎక్బాల్‌తో కలిసి టైర్ మార్చడంలో నిమగ్నమయ్యారు. అదే సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన మరో లారీ కంటైనర్ ఆగిఉన్న లారీని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో క్లీనర్ హిజాజ్‌కు తీవ్రగాయాలై దుర్మరణం చెందగా, డ్రైవర్ ఎక్బాల్‌కు గాయాలయ్యాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

బైక్ ధాన్యం కుప్పను ఢీకొని విద్యార్థి..

శివ్వంపేట మండలం గోమారంలో రోడ్డుపై ధాన్యం కుప్పను బైక్ ఢీకొన్న ఘటనలో ఐటీఐ విద్యార్థి మరణించగా మరో విద్యార్థికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గోమారం గ్రామానికి చెందిన బాణాపురం కార్తీక్(16) ఐటీఐ మొదటి సంవత్సరం పూర్తి చేసుకున్నాడు. కొత్త్వాల యశ్వంత్ సెకండియర్ పూర్తి చేసుకున్నాడు. ఇద్దరు కలిసి సోమవారం రాత్రి కూరగాయలు తీసుకువచ్చేందుకు పెద్ద గొట్టిముక్ల నుంచి బైక్‌పై గోమారం గ్రామానికి బయలుదేరారు. గోమారంలోని ఉన్నత పాఠశాల వద్దకు రాగానే రోడ్డుపై ఉన్న వరి ధాన్యం కుప్పలను ప్రమాదవశాత్తు బైక్ ఢీకొంది. ఈ ఘటనలో రోడ్డు పక్కన బండరాయిపై పడటంతో కార్తీక్ తలకు తీవ్ర గాయం కాగా, మరో విద్యార్థి యశ్వంత్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కార్తీక్‌ను మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.

శుభకార్యానికి వెళ్తూ బైక్‌పై నుంచి పడి మహిళ..

శుభకార్యానికి బైక్‌పై వెళ్తూ అదుపుతప్పడంతో తల్లికొడుకులకు తీవ్రగాయాలు కాగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తల్లి మృతిచెందింది. తూప్రాన్‌ఎస్ఐ శివానందం వివరాల ప్రకారం.. చిన్నశంకరంపేట మండలం గవ్వలపల్లికి చెందిన లచ్చిగల్ల అనిత (45), ఆమె కుమారుడు లచ్చిగల్ల ప్రభాకర్ ఈ నెల 23న వర్గల్ మండలం వేలూరులో బంధువుల ఇంట్లో జరుగుతున్న వివాహానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్ శివారులో గజ్వేల్ - తూప్రాన్ రోడ్డుపై ఇసుక కారణంగా బ్రేక్ వేయడంతో బైక్ అదుపు తప్పి కిందపడటంతో తల్లికొడుకులకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ అనిత మంగళవారం మృతిచెందినట్లు ఎస్ఐ వివరించారు. భర్త మల్లేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్ఐ తెలిపారు.

పేదల భూములు లాక్కుంటారా?


కలెక్టరేట్ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో నిమ్జ్ భూ బాధితుల ధర్నా

సంగారెడ్డి రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి): పేదల భూములకు తక్కువ పరిహారం చెల్లించి అప్పనంగా లాక్కుంటున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ప్రభుత్వాన్ని విమర్శించారు. సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట మంగళవారం సీపీఎం పార్టీ అధ్వర్యంలో నిమ్జ్ భూ బాధితులు ధర్నా చేశారు. అంతకు ముందు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి భూములను గాని, మాజీ సీఎం కేసీఆర్ భూములను గాని కేవలం రూ. 15 లక్షలకు ఎకరా చొప్పున అమ్ముతారా అని ప్రశ్నించారు. జహీరాబాద్ నిమ్జ్ రైతులకు 2023 భూ చట్టం ప్రకారం మార్కెట్ ధరకంటే మూడింతలు అదనంగా నష్టపరిహారం చెల్లించాలని, ప్రతీ ఎకరాకు 120 గజాల స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పారిశ్రామికవేత్తలే కాదు సీఎం రేవంత్‌రెడ్డి వచ్చినా నిమ్జ్ భూముల్లో అడుగు పెట్టనీయమని హెచ్చరించారు. లగచర్లకు ఓ న్యాయం, నిమ్జ్‌కో న్యాయమా అని ఆయన ప్రశ్నించారు. సీఎంను కలిసి నిమ్జ్ భూ బాధితుల పక్షాన చర్చిస్తామని జాన్‌వెస్లీ తెలిపారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్, జహీరాబాద్ సీపీఎం ఏరియా కార్యదర్శి రాంచంద్రం మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాజయ్య, మాణిక్యం, జి.సాయిలు, నర్సింలు, మహిపాల్, నాగేశ్వర్‌రావు, వద్యాసాగర్, కృష్ణ, అశోక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో లేగదూడ మృతి

కంగ్టి, మే 27(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని సిద్ధేశ్వర ఆలయం సమీపంలో మంగళవారం కుక్కలు ఓ లేగదూడపై దాడిచేసి చంపేశాయి. కుక్కలు లేగదూడను యథేచ్ఛగా కరిచి తీవ్రంగా గాయపరచడంతో అది అక్కడికక్కడే మృతి చెందింది. ఇటీవల కుక్కలు యథేచ్ఛగా సంచరిస్తూ దాడులు చేయడం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వరకట్న వేధింపులకు వివాహిత బలి


శిరీష మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

జగదేవ్‌పూర్, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చాట్లపల్లిలో వరకట్న వేధింపులు భరించలేక ఓ వివాహిత ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. జగదేవ్‌పూర్ ఎస్ఐ చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ మండలం వెంకిర్యాల గ్రామానికి చెందిన శిరీష(21)తో జగదేవ్‌పూర్ మండలం చాట్లపల్లి గ్రామానికి చెందిన గడ్డమీది వంశీధర్‌తో నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. వివాహ సమయంలో కట్నం, ఇతర లాంఛనాలతో పెళ్లిని ఘనంగా జరిపించారు. వారికి ఒక పాప సంతానం. అయితే కొద్దిరోజులుగా భర్త వంశీధర్ శిరీషను పుట్టించి నుంచి అదనంగా వరకట్నం తీసుకురమ్మని ఇబ్బందులకు గురిచేయగా రెండు విడతల్లో రూ.1.50లక్షల వరకు ఇచ్చారు. ఇటీవల వంశీధర్ మద్యానికి బానిసై పుట్టించి నుంచి మరింత డబ్బు తీసుకురావాలంటూ వేధిస్తున్నాడు. సోమవారం రాత్రి కట్నం కోసం భార్యతో గొడవపడ్డాడు. ఈ వేధింపులు భరించలేక శిరీష రాత్రి కుటుంబ సభ్యులు నిద్రించిన తర్వాత బెడ్రూంలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. మృతురాలి తల్లి రేణుక ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అదృశ్యమైన వ్యక్తి బావిలో శవంగా..

కొండపాక, మే 27 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల క్రితం ఇంటి నుంచి అదృశ్యమైన వ్యక్తి బావిలో మృతదేహం లభ్యమైన సంఘటన మండలంలోని తిమ్మారెడ్డిపల్లి శివారులో చోటుచేసుకున్నది. తిమ్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన సున్నం భాస్కర్ (32)అనే వ్యక్తి ఈ నెల 25న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. అతడి కోసం కుటుంబీకులు వెతికినా ఫలితం లేకపోయింది. తిమ్మారెడ్డిపల్లి శివారులో వ్యవసాయ బావి వద్ద చెప్పులు కనబడడంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారాన్ని అందించారు. గ్రామస్థుల సహకారంతో పోలీసులు సోమవారం పొద్దుపోయే వరకు గాలించగా రాత్రి భాస్కర్ శవం లభ్యమైంది. అప్పుల బాధతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్టు కుటుంబీకులు పేర్కొన్నారు. అయనకు భార్య, కూతురు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్టు కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

జోగిపేట రూరల్, మే 27(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జోగిపేట ఎస్ఐ పాండు తెలిపిన వివరాల ప్రకారం.. జోగిపేటకు చెందిన మంగలి శ్రీకాంత్ కట్టింగ్ షాప్ నడుపుతూ జీవిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని బలవన్మరణం చెందాడు.ఎస్ఐ పాండు ఘటనాస్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ప్రమాదవశాత్తు భవన నిర్మాణ కార్మికుడి మృతి

శివ్వంపేట్, మే 27(ఆంధ్రజ్యోతి) గుడి నిర్మాణ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి ఏపీకి చెందిన భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం లింగోజిగూడ తండాలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీ కాకినాడ ప్రాంతంలోని పెద్దాపురానికి చెందిన శిరం కొండబాబు(50) మండల పరిధిలోని లింగోజిగూడ తండాలో గుడి నిర్మాణం పనులు చేస్తున్నాడు. ప్రమాదవశాత్తు కాలు జారిపడి తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బంధువైన కొయ్యల శ్రీను ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని నర్సాపూర్ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.

పశువుల అక్రమ రవాణా అరికట్టాలి: సంగారెడ్డి ఎస్పీ

సంగారెడ్డి క్రైం, మే 27 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ పండగ సందర్భంగా గోవులు, పశువుల అక్రమ రవాణా జరుగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. జిల్లాలోని కంది, ముత్తంగి పోలీస్ చెక్‌పోస్టులను ఆయన మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసులకు పలు సూచనలు చేశారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ, పశువుల అక్రమ రవాణా జరుగకుండా చూడాలన్నారు. రాత్రి వేళల్లో చెక్‌పోస్టులలో విధులు నిర్వహించే సిబ్బంది, లైట్ బటన్,రిఫ్లెక్షన్ జాకెట్ ధరించాలని సూచించారు.

పరీక్ష రాస్తున్న ఇంటర్ విద్యార్థికి అస్వస్థత

కొండపాక, మే 27 (ఆంధ్రజ్యోతి): కొండపాక జూనియర్ కళాశాలలో దుద్దెడ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థి మంగళవారం ఇంటర్ అడ్వాన్స్‌డ్ పరీక్ష రాస్తూ అస్వస్థతకు గురయ్యాడు. నారాయణఖేడ్ కు చెందిన నిరీక్షన్ అనే విద్యార్థి కొండపాక మండలం దుద్దెడ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఇంటర్ పరీక్షలు పూర్తయిన తర్వాత సెలవుల్లో ఇంటికి వెళ్లిపోయారు. కెమిస్ట్రీ పరీక్ష కోసం ఇంప్రూమెంట్ కట్టి పరీక్ష రాసేందుకు వచ్చాడు. మంగళవారం కొండపాక జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో పరీక్ష రాస్తుండగా కొద్దిసేపటికి నిరీక్షన్‌కు వాంతులు విరేచనాలు అయ్యాయి. అక్కడే ఉన్న వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స చేసినప్పటికీ తగ్గలేదు. దీంతో వెంటనే 108 అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు.



చేనుకు చేవ.. వేప

చీడపీడల నివారణకు దోహదం.. వేప పిండి, నూనె అన్ని ఎరువులే

రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు.. భూసారం పెంచడమే లక్ష్యం

సిద్దిపేట రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి): వేప ఆరోగ్య ప్రదాయిని. వ్యవసాయంలోనూ వేపకు ప్రాధాన్యం ఉంది. పంటలకు ఆశించే చీడపీడల నివారణకు ఎంతగానో ఉపయోగపడుతుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. వేప పిండి, వేప నూనె, వేప కషాయంలతో సేంద్రియ ఎరువులను తయారు చేసి వాడితే భూమి సారవంతంగా మారడంతోపాటు పంట దిగుబడులు పెరుగుతాయని చెబుతున్నారు.

వేప పిండితో తెగుళ్ల నివారణ..

వేపపిండితో పంటలో వేరు కుళ్లు, దుంప కుళ్లు వంటి తెగుళ్లను సమర్థవంతంగా నివారించవచ్చు. ఎకరానికి నాలుగు నుంచి ఐదు సంచుల వేపపిండి వినియోగించడం వల్ల క్రిమికీటకాలను నివారించవచ్చు. ఎండు తెగులు నివారణకు ఉపయోగించే ట్రైక్రోడర్మా తోపాటు 90 కిలోల పశువుల ఎరువు, 10 కిలోల వేప పిండి కలిపి వాడితే మంచి ఫలితం ఉంటుంది. ఐదు కిలోల యూరియాకు కిలో వేప పిండి కలిపి వాడితే మంచి ఫలితం ఉంటుంది. యూరియాపై వేపపిండి ఒక పొరలా ఏర్పడడంతో తొందరగా నీటిలో కరిగి మొక్కకు బలాన్ని చేకుర్చుతుంది.

పంటలకు రక్షణగా వేప గింజల కషాయం

ఖరీఫ్ సీజన్‌లో వేప గింజలు విరివిగా వేప గింజల కషాయాన్ని తయారు చేసుకోవచ్చు. వేప గింజలను పొడిగా చేసి ఓ వస్త్రంలో కట్టి పది లీటర్ల నీటిలో సుమారు పది గంటల పాటు నానబెడితే వేప కషాయం రెడీ అవుతుంది. ఇలా తయారు చేసుకున్న కషాయాన్ని వంద లీటర్ల నీటిలో వంద గ్రాములు కలిపి ఎకరానికి స్ప్రే చేస్తే పురుగు గుడ్డు దశ, కోశస్థ దశ, ప్యూపా దశలను అరికట్టవచ్చునని వ్యవసాయ అధికారులు రైతులకు సూచిస్తున్నారు.

వేప నూనెతో..

వేప నుంచి నూనె తీసిన తర్వాత మిగిలే చెక్కను వృథా చేయకుండా భూమిలో వేయడం వల్ల నాలుగు నుంచి ఆరు శాతం నత్రజని, భాస్వరం, 0.5 శాతం పోటాష్ అందే అవకాశం ఉంటుంది. అలాగే పంటకు సల్ఫర్ కూడా అంది దిగుబడి పెంచడంలో తోడ్పడుతుంది. వేప నూనె పంటలో రసం పీల్చే పురుగులు, లద్దె పురుగులు, కాండం తొలుచు పురుగుల నివారణకు దోహదపడుతుంది. లీటరు నీటికి 5 మిల్లీ లీటర్ల వేప నూనెను కలిపి మొక్కలపై స్ప్రే చేస్తే ఆ వాసనకు ఆడ రెక్కల పురుగులు గుడ్లు పెట్టడానికి అవకాశం లేకుండా పోవడంతో పాటు పెట్టిన గుడ్లను పొదగకుండా చేస్తుంది. గుడ్డు నుంచి వచ్చే లార్వాను సమర్థవంతంగా అరికడుతుంది. పంటలో రెక్కల పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలి. పురుగు ఉధృతిని బట్టి స్ప్రే చేస్తే తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించవచ్చు. పంటలను ఆశించే గొంగళి పురుగుపైన స్ప్రే చేస్తే ఆ పురుగు తర్వాత దశను చేరుకోలేక చనిపోతుంది. మొక్కజొన్న పంటలో వచ్చే కత్తెర పురుగు నివారణకు పది వేల పీపీఎం అజాడిరక్టిన్ స్ప్రే చేస్తే పురుగు అదుపులోకి వచ్చి దిగుబడి తగ్గకుండా దోహదపడుతుంది.

రసాయన ఎరువులు వాడకం తగ్గించడమే లక్ష్యంగా...



రైతులు రసాయన ఎరువులు ఎక్కువ మొతాదులో వాడటం వల్ల భూసారం దెబ్బతింటుంది. రైతులు లాభసాటి వ్యవసాయం చేసేలా సేంద్రియ పద్ధతుల్లో ఎరువుల వాడకంపై అవగాహన కల్పిస్తున్నాం. వేపపిండి వాడాలి అనుకునే రైతులు వేపకాయలను స్థానికంగానే సమకూర్చుకోవచ్చు. ఇది వేపపండ్లు లభించే కాలం కాబట్టి వేపకాయలను సేకరించి ఎండబెట్టిన తర్వత మిశ్రమంగా చేసి వాడుకుంటే వేప కంటే మించిన ఎరువు పంటలకు మరొకటి ఉండదు. చీడపీడల నివారణతో పాటు పంట ఉత్పత్తులను నిల్వ చేయడంలోనూ ఉపయోగించవచ్చు. వేపతో తయారు చేసే సేంద్రియ ఎరువులతో తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించవచ్చు. ఆ దిశగా రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం.

- పద్మ, ఏడీఏ, సిద్దిపేట

జీవాల ఎరువుతో జీవం

అక్కన్నపేట, మే 27 (ఆంధ్రజ్యోతి): భూసారం పెంపునకు మూగజీవాల ఎరువు ఎంతో దోహదపడుతుందని వ్యవసాయ నిపుణులు, అధికారులు సూచిస్తున్నారు. రసాయన ఎరువుల వినియోగంతో భూసారం దెబ్బతినడం, పంట దిగుబడి తగ్గుతుండటంతో ఆవులు, ఎద్దులు, గొర్రెలు, మేకలు, కోళ్ల విసర్జితాలు, కంపోస్టు వంటి సేంద్రియ ఎరువులపై రైతులు దృష్టి సారించాలని సూచిస్తున్నారు. రైతులు తమ పొలాల్లో గొర్రెలు, మేకల మందలు నిలుపడం ద్వారా వాటి ఎరువును పొలాలకు అందిస్తున్నారు. అలాగే పశువుల ఎరువును ట్రాక్టర్ ద్వారా పొలాలకు తరలించి చల్లుతున్నారు. పశువుల పేడ ట్రాక్టర్‌కు రూ.4వేల చొప్పున రైతులు కొనుగోలు చేస్తున్నారు.

ఎన్నో ప్రయోజనాలు..

గొర్రెలు, మేకల మూత్రంలో పీహెచ్ విలువ 7.7 ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. వీటి ద్వారా చౌడు భూములు సారవంతంగా మారుతాయి. మూగజీవా లీటర్ మూత్రంలో 9 నుంచి 13 గ్రాముల నత్రజని, 17 నుంచి 20 గ్రాముల పొటాషియం, పాస్పరస్ వంటివి ఉంటాయి. ఒక గొర్రె ద్వారా ఒక రాత్రికి లీటర్ మూత్రం, 380 నుంచి 540 గ్రాముల వరకు పేడ లభిస్తుంది. గొర్రెలు, మేకల మంద ద్వారా నత్రజని, బాస్వరం, పొటాష్‌తో పాటు బ్యాక్టీరియా, ప్రోటోజోవా, ఫంగి తదితర ఉపయోగకరమైన సూక్ష్మజీవులతో నేల సారవంతం అవుతుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

సేంద్రియ ఎరువులను వాడుతున్నాం..



భూసారం పెంచేందుకు సేంద్రియ ఎరువులనే వాడుతున్నాం. పశువుల పేడ, కోళ్ల ఎరువులు తీసుకువచ్చి పొలాల్లో చల్లుతున్నాం. గొర్రెలు, మేకల మందలను పొలాల్లో పెడుతున్నాం. సేంద్రియ ఎరువుల వినియోగంతో పంటల దిగుబడులు పెరుగుతున్నాయి.

-వంగల భాస్కర్ రెడ్డి, రైతు, గొల్లకుంట, అక్కన్నపేట మండలం

గొర్రెలు, మేకల మందలను నిలపాలి



రైతులు గొర్రెలు, మేకల మందలను పొలంలో ఆపితే అధిక దిగుబడి వస్తుంది. పొలాలు సారవంతంగా తయారవుతాయి. నత్రజని, పొటాష్, పాస్పరస్‌లను కూడా అందిస్తుంది. అలా గొర్రెల మందులు ఆపడంతో కలుపు మొక్కల నియంత్రణకు కూడా సహాయపడుతుంది.

-తస్లీమా సుల్తానా, మండల వ్యవసాయధికారి, అక్కన్నపేట





ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు వినతి పత్రం అందజేస్తున్న బిస్మాట్ ప్రతినిధులు

డిప్యూటీ సీఎం భట్టిని కలిసిన బిస్మాట్ ప్రతినిధులు

సిద్దిపేట కల్చరల్, మే 27 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను బడ్జెట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (బిస్మాట్) ప్రతినిధులు కలిశారు. రాష్ట్రంలో ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల నియంత్రణ, విద్యాహక్కు చట్టం అమలు, 25 శాతం రిజర్వేషన్లు తదితర అంశాలపై స్పష్టత ఇవ్వాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో వారు భట్టిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ విషయమై ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. మంత్రివర్గ ఉపసంఘం తీసుకునే కార్యాచరణలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల అభిప్రాయాలను కూడా పరిగణలోకి తీసుకుంటామని చెప్పినట్లు చెప్పారు. ఉప ముఖ్యమంత్రిని కలిసిన వారిలో బిస్మాట్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపతి శేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జగ్గు మల్లారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ జలంధర్, ఉపాధ్యక్షులు మహ్మద్ షఫీ, దయాకర్‌రెడ్డి, రాష్ట్ర ప్రతినిధులు నారాయణరెడ్డి, భరత్‌కుమార్, మీనేంద్రరావు, దయాకర్‌రెడ్డి, సింహారెడ్డి, యోగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ మోడల్ హౌజ్ ప్రారంభానికి సిద్ధం

● గృహనిర్మాణశాఖ పీడీ మాణిక్యం



తూప్రాన్‌లో ఇందిరమ్మ మోడల్ హౌజ్‌ను పరిశీలిస్తున్న పీడీ

తూప్రాన్, మే 27 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్‌లో నిర్మించిన ఇందిరమ్మ మోడల్ హౌజ్ ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు గృహ నిర్మాణశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ మాణిక్యం పేర్కొన్నారు. జిల్లాలో మొదటగా నిర్మించిన ఇందిరమ్మ మోడల్‌హౌజ్‌ను మంగళవారం పరిశీలించారు. తెలంగాణ అవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నామని, మిగిలిపోయిన పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో శేషాద్రి, ఎంపీవో సతీష్, ఏఈ స్మైలీ విరోనిక, సిబ్బంది పాల్గొన్నారు.

దత్తగిరి ఆశ్రమంలో కేశవరావు పూజలు

ఝరాసంగం, మే27(ఆంధ్రజ్యోతి) : మండలం పరిధి బర్దీపూర్ గ్రామంలోని దత్తగిరి ఆశ్రమంలో మంగళవారం నిర్వహించిన శనీశ్వరుడి జయంతి ఉత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు కె.కేశవరావు, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆశ్రమ అర్చకులు వారి పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఆశ్రమ పీఠాధిపతి వైరాగ్య శిఖవణి అవదూత గిరి మహారాజ్ వారిచే శనీశ్వరుడికి తైలాభిషేకంతో ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో మహామండలేశ్వర సిద్ధేశ్వరనందగిరి మహారాజ్, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.



శనీశ్వరుడికి పూజలు చేస్తున్న ప్రభుత్వ సలహాదారుడు కేశవరావు

తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ఆవిర్భావం

కొండపాక, మే 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ఆవిర్భవించింది. కొండపాక శివారులో కొమురవెల్లి కమాన్ సమీపంలో ఒక హోటల్లో జరిగిన కళాకారుల సమావేశంలో దీన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వివిధ రంగాల కళాకారులు మాట్లాడుతూ గత 30 సంవత్సరాల నుంచి కళనే నమ్ముకుని జీవనం సాగిస్తూ, తెలంగాణ ఉద్యమంలో కళాకారులు ప్రధాన భూమిక వహించారని పేర్కొన్నారు. అనంతరం పలు తీర్మానాలు చేశారు. ప్రభుత్వం ఒక్కొక్క కళాకారునికి 500 గజాల భూమి ఇవ్వాలన్నారు. అలాగే వడ్డీ లేని రుణాలు, వృద్ధ కళాకారులకు పెన్షన్లు తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు.

రాష్ట్ర కమిటీ ఎన్నిక

ఈ సమావేశంలో తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ రాష్ట్ర కమిటీని ప్రకటించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా పత్తిపాటి రమణాకర్, ప్రధాన కార్యదర్శిగా సత్తార్, కోశాధికారిగా గజ్వేల్ వేణు, ఉపాధ్యక్షులుగా జీఎల్ నాందేవ్, ఫోక్ ఇండస్ట్రీ సలహాదారులుగా దరువు అంజన్న, మిట్టపల్లి సురేందర్, అంతడుపుల నాగరాజ్, అభినయ శ్రీనివాస్, కోదారి శీను, అంబటి వెంకన్న, బైరాగి మోహన్, కళాంజలి రాజేష్, దత్తాత్రేయ, చికోడు నరసింహులు, కాదూరి గణేష్, విష్ణు, కాపర్తి మల్లికార్జున్‌లను ఎన్నుకున్నారు. కోర్ కమిటీ సభ్యులుగా జడల రమేష్, మాట్ల తిరుపతి, శంకర్ బాబు, వడ్లకొండ అనిల్, బుర్ర సతీష్, పొద్దుపొడుపు శంకర్, మాంకాల ప్రసాద్, మల్లిక్ తేజ, పాత శ్రీధర్, గణ శ్యామ్, బుర్ర నటరాజ్, ఓరుగంటి శేఖర్, కోడం సంతోష్, తేలు విజయ, వినోద్, విజువల్ శ్రీనివాస్ తదితరులను ఎన్నుకున్నారు ఈ సందర్భంగా బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొంగు రాజేందర్‌రెడ్డి, గొల్లపల్లి ఆంజనేయులు కళాకారులను శాలువలు కప్పి, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సత్కరించారు.



సమావేశంలో పాల్గొన్న వివిధ రంగాలకు చెందిన కళాకారులు

కేతకీలో భక్తుల రద్దీ

ఝరాసంగం, మే27(ఆంధ్రజ్యోతి) : దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన శ్రీ కేతకీ సంగమేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీ కనిపించింది. అమావాస్య సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో శివరుద్రప్ప, పోలీస్ సిబ్బంది చర్యలు తీసుకున్నారు.



క్యూలో బారులు తీరిన భక్తులు



శిక్షణా శిబిరంలో పాల్గొన్న కేడెట్లు

ఎన్‌సీసీ శిబిరం ప్రారంభం

పటాన్‌చెరు రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని 33 (తెలంగాణ) బెటాలియన్ ఎన్ సీసీ కేడెట్ల కోసం నిర్వహిస్తున్న సంయుక్త వార్షిక శిక్షణా శిబిరాన్ని (సీఏటీసీ 3) కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ రమేష్ సరియాల్ మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్ (రుద్రారం) ప్రాంగణంలో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో తెలంగాణ వ్యాప్తంగా 600 మంది క్యాడెట్లు పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమంలో సుబేదార్ మేజర్, అసోసియేట్ ఎన్ సీసీ ఆఫీసర్లు, తెలంగాణలోని ఎన్‌సీసీ 9, 12, 32, 33వ బెటాలియన్ల కేడెట్లు పాల్గొన్నారు.

చదువుల సరస్వతులు రేవతి, నవ్య

● పరీక్ష ఎదైనా ఫస్ట్, సెకండ్ స్థానాలు వీళ్లవే

● పోటీ పరీక్షల్లో రాణిస్తున్న వీరారెడ్డిపల్లి అమ్మాయిలు

మిరుదొడ్డి, మే27(ఆంధ్రజ్యోతి): పరీక్ష ఏదైనా రాష్ట్రస్థాయిలో ఫస్ట్, సెకండ్ ర్యాంకులు వీళ్లవే.. ఇటీవల విడుదలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఈసెట్ ఈసీఈ విభాగం ఫలితాల్లోనూ తొలి రెండు ర్యాంకులు సాధించి ఔరా అనిపించారు సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని వీరారెడ్డిపల్లి గ్రామానికి చెందిన రేవతి, నవ్యలు. వీరిద్దరు సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి గ్రామంలోని ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలో 10 వ తరగతి వరకు విద్యను అభ్యసించారు. అనంతరం పాలీసెట్ రాయడంతో మంచి మార్కులతో సికింద్రాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈసీఈలో డిప్లొమాను పూర్తిచేశారు. ఈ నెల 15, 24వ తేదీల్లో వెలువడిన ఏపీ, టీజీ ఈసెట్ ఫలితాల్లోనూ ఇద్దరు ప్రథమ, ద్వితీయ ర్యాంకులను సాధించి అబ్బురపరిచారు.



కుటుంబ సభ్యులతో రేవతి, దివ్య

ఎలాంటి కోచింగ్ లేకుండానే..

మాది నిరుపేద కుటుంబం. నాన్న యాదగిరి వ్యవసాయదారుడు. అమ్మ కవితా బీడీ కార్మికురాలు. ముందు నుంచి ప్రత్యేక ప్రణాళికతో చదువుతున్నాను. ఏపీ ఈసెట్‌లో ఈసీఈ విభాగంలో 200 మార్కులకు గాను 169, టీజీ ఈసెట్‌లో 164మార్కులు రావడంతో రెండింట్లోనూ రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు వచ్చింది. ఎలాంటి కోచింగ్ లేకుండా కేవలం అధ్యాపకులు చెప్పిన అంశాలను క్షుణ్ణంగా చదివి పరీక్ష రాశాను ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్ (ఐఈఎస్)కు ఎంపికకావడమే తన లక్ష్యం.

-కట్లే రేవతి

ఐఏఎస్ కావడమే లక్ష్యం

మానాన్న నర్సింలు హమాలీ కార్మికుడు. తల్లి చిన్నవ్వ బీడీ కార్మికురాలు. నిత్యం అమ్మానాన్నల పడుతున్న కష్టం నన్ను కలిచివేస్తుంది. వారి కష్టాలను దూరం చేయాలన్న ఉద్దేశంతో బాగా చదివా. ఏపీ ఈసెట్‌లో ఈసీఈ విభాగంలో 200 మార్కులకు గాను 155, టీజీ ఈసెట్‌లో 200 మార్కులకు గాను 161 మార్కులను సాధించి రెండు చోట్లా రెండో ర్యాంకులను సాధించాను. ఇంజనీరింగ్‌ను పూర్తిచేసి యూపీఎస్సీ రాసి ఐఏఎస్ కావాలన్నదే తన లక్ష్యం.

-పంజా నవ్య

పార్టీలకతీతంగా అభివృద్ధి

● మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



వెంకటాయపల్లిలో పోస్టాఫీసు ప్రారంభిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు

తూప్రాన్, మే 27(ఆంధ్రజ్యోతి): పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేస్తున్నట్లు మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు పేర్కొన్నారు. తూప్రాన్ మండలం వెంకటాయపల్లిలో ఏర్పాటు చేసిన నూతన పోస్టాఫీస్‌ను మంగళవారం పోస్టల్‌శాఖ సూపరింటెండెంట్ శ్రీహరితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గతంలో ఎన్నికైన ఎంపీలు పదేళ్లలో ఒక్కసారి కూడా కనిపించలేదని, తాను 24/7 అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. తూప్రాన్ పట్టణంలో పోస్టల్‌శాఖకు చెందిన భూమి కబ్జాకు గురవుతుందన్నారు. సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం సిద్ధన్నపేటలో రైతులు 10 లారీల ధాన్యం పంపిస్తే, ఇప్పుడు 55 క్వింటాళ్ల ధాన్యం తక్కువ రాస్తానంటూ రైసుమిల్లర్ చెబుతున్నట్లు పేర్కొన్నారు. రామాయంపేటలో పచ్చజొన్నలు కొనుగోలు కేంద్రం లేదని చెప్పడంతో కలెక్టర్‌తో మాట్లాడి ఏర్పాటు చేయిస్తానని ఎంపీ వివరించారు. పోస్టాఫీసులో ఖాతాలు ప్రారంభించినవారికి ఖాతా పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ లంబ వెంకటమ్మ, రమేష్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో శేషాద్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్, నత్తి మల్లేశ్‌ముదిరాజ్, మధుసూదన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పిట్ల పోచయ్య, జానకీరాంగౌడ్, మహేశ్‌గౌడ్, నర్సింజీ, విఠల్ పాల్గొన్నారు.

ఉత్తమ రక్తదాతలకు దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ కల్చరల్, మే 27 (ఆంధ్రజ్యోతి) : ఉత్తమ రక్తదాతల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రెడ్ క్రాస్ సొసైటీ మెదక్ శాఖ చైర్మన్ లయన్ డాక్టర్ ఏలేటి రాజశేఖర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది మే నుంచి ఈ ఏడాది మే 31 వరకు 25 సార్లు కంటే ఎక్కువ సార్లు రక్త దానం చేసిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. అందులో ఒకరిని ఎంపిక చేసి హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో అవార్డులు అందజేసి, సన్మానం చేయనున్నట్లు తెలిపారు. అర్హులైనవారు రక్తదానం ఫొటోలు, పేపర్ క్లిప్పింగ్‌లు, సర్టిఫికెట్లతోపాటు తమ వివరాలను కింద తెలిపిన నంబర్లకు వాట్సప్ చేసి పేరు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. పి.లక్ష్మణ్ యాదవ్ వైస్ చైర్మన్ 7989964476, టి.సుభాష్ చంద్రబోస్ సెక్రటరీ 9849099670, డీజీ శ్రీనివాసశర్మ ట్రెజరర్ 9440451575 నంబర్లకు మే 31 సాయంత్రం 6 గంటల లోపు పంపించాలన్నారు.

న్యూస్ బాక్స్

పెద్దశంకరంపేట ఇన్‌చార్జి ఎంపీడీవోగా షాకీర్‌అలీ

పెద్దశంకరంపేట, మే 27 (ఆంధ్రజ్యోతి) : పెద్దశంకరంపేట మండల ఇన్‌చార్జి ఎంపీడీవోగా షాకీర్‌అలీ మంగళవారం నియమితులయ్యారు. పేట ఎంపీడీవో కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న షాకీర్‌అలీకి ఇన్‌చార్జి ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది షాకీర్‌అలీని సన్మానించారు.

మహిళలపై వేధింపులకు పాల్పడితే చర్యలు

చిన్నశంకరంపేట, మే 27 (ఆంధ్రజ్యోతి) : పని ప్రదేశంలో మహిళలపై వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ మన్నన్ హెచ్చరించారు. మంగళవారం చిన్నశంకరంపేట తహసీల్దార్ కార్యాలయంలో అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు చేసి మాట్లాడారు. కమిటీ సభ్యులుగా తహసీల్దార్ మన్నన్, ఎంపీడీవో దామోదర్, ఎస్ఐ నారాయణగౌడ్, ఎంఈవో పుష్పవేణి, వైద్యాధికారి సాయి సింధు, పశు వైద్యాధికారి గీతామాలిక, ఏవో శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అంజమ్మ, సంధ్య, ఏపీఎం లక్ష్మీనరాయణ నియామకమయ్యారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

పుల్‌కల్, మే 27 (ఆంధ్రజ్యోతి) : చెట్ల పెంపకం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని జోగిపేట డివిజన్ వ్యవసాయ శాఖ ఏడీఏ జి.రమాదేవి అన్నారు. మండలంలోని ఇసోజిపేటలో మంగళవారం ఏరువాక కేంద్రం సంగుపేట-వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల కంది అధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు.

సాగుపై రైతులకు అవగాహన

సంగారెడ్డి రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి) : రైతులు పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయశాఖ అధికారులు సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని రైతువేదికలో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం వ్యవసాయ శాఖ జేడి శివప్రసాద్ మాట్లాడారు.

ఘనంగా శని జయంతి

వట్‌పల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి) : శని జయంతిని పురస్కరించుకొని మండల పరిధిలోని దుద్యాల (సర్వేశ్వరపురం) ఆశ్రమంలో అంబిక శివయోగి ఆధ్వర్యంలో పూజారి విజయస్వామి చేతులమీదుగా శనీశ్వరునికి తిలాభిషేకం, హోమం నిర్వహించి. తీర్థ ప్రసాదాలను అందజేసి అనంతరం అన్నదానం నిర్వహించారు.





మెదక్ పట్టణంలోని భారత్‌గ్యాస్- అంబేడ్కర్ సర్కిల్ రోడ్డు జలమయమైన దృశ్యం, కల్హేర్‌లో మర్రికుంట సమీపంలో భారీ వర్షంతో జలమయమైన భూములు

ఉరుములు.. మెరుపులు

- మెదక్ జిల్లాలో భారీ వర్షం
- గంటపాటు కుండపోత
- రోడ్లు, వీధులన్నీ జలమయం

మెదక్, మే 27 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పవాయుపీడన ప్రభావంతో పాటు నైరుతీ రుతుపవనాల రాకతో మెదక్ జిల్లాలో మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో గంటపాటు భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణంలో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. మెదక్‌లోని ఫతేనగర్,చమన్, రాందాస్ చౌరస్తా, పాతబస్టాండ్ ప్రాంతాల్లో నీరు నిలిచి వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. చమన్-ఫతేనగర్ రహదారి పక్కన మురుగు కాలువ పైనుంచి నీరు ప్రవహిస్తుండడంతో వాహనాలు డ్రైనేజీలో తరచుగా పడుతున్నాయని, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆరోపిస్తున్నారు.

ఖేడ్, కల్హేర్‌లో భారీ వర్షం

నారాయణఖేడ్, మే 27 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో మంగళవారం నారాయణఖేడ్‌లో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమైనప్పటికీ, మధ్యాహ్నం నుంచి మేఘాలు కమ్ముకోవడంతో చీకటి నెలకొన్నది. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు భారీ వర్షం కురియడంతో పట్టణంలోని ప్రధాన రోడ్లపై వర్షం నీరు భారీగా ప్రవహించింది. రెండు, మూడురోజులుగా వర్షాలు కురియకపోవడంతో కొందరు రైతులు ముందస్తుగానే విత్తనాలు విత్తారు. ఈ వర్షం వల్ల విత్తనాలు మొలకెత్తవని రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాగే మండల కేంద్రమైన కల్హేర్‌తోపాటు మండల పరిధిలోని మాసాన్‌పల్లి, మార్డి, ఇందిరానగర్, రాపర్తి తదితర గ్రామాల్లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. భారీ వర్షంతో కల్హేర్ సమీపంలోని మర్రికుంట, మహారాజ్ వాగులోకి స్వల్పంగా వరదనీరు వచ్చి చేరింది. పంట పొలాలు పూర్తిగా నీటితో నిండిపోవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చినుకు పడితే చిత్తడే

మనోహరాబాద్, మే 27 (ఆంధ్రజ్యోతి) : మనోహరాబాద్ మండల కేంద్రంలోని దండుపల్లి నుంచి వర్గల్ వైపు వెళ్లే దారి చినుకుపడితే చిత్తడిగా మారుతోంది. ఈ దారి గుండా రంగాయపల్లి, చెట్లగౌరారం, ఎమ్ఎస్ అగర్వాల్ స్టీల్ పరిశ్రమ వాహనాలు రాత్రి, పగలు తేడా లేకుండా పరిమితి మించి భారీ స్టీల్ లోడ్‌తో వెళ్తుండడంతో వర్షం పడిన ప్రతిసారీ చిత్తడిగా మారుతుంది. అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని గ్రామస్థులు, ప్రయాణికులు కోరుకుంటున్నారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



శిక్షణలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రభాకర్

సంగారెడ్డి రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన అందిస్తున్నట్టు సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లిలోని జడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయులకు మంగళవారం నిర్వహిస్తున్న శిక్షణలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల కృషితో ఎందరో ప్రయోజకులయ్యారని, ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచే విధంగా కృషి చేయాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల తరువాత ఉపాధ్యాయుల పాత్రే కీలకమని, శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో అమలు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈవో వెంకటేశ్వర్లు, మాజీ సీడీసీ చైర్మన్ బుచ్చిరెడ్డి, విజయేందర్‌రెడ్డి, ఎంఈవో విద్యాసాగర్ పాల్గొన్నారు.

యోగాసనాలతో ఒత్తిడి దూరం



యోగాసనాలు చేయిస్తున్న ఆయుష్‌శాఖ సిబ్బంది, ఏఎన్ఎంలు

సంగారెడ్డి అర్బన్/రామాయంపేట, మే 27 (ఆంధ్రజ్యోతి) : యోగాసనాలతో ఒత్తిడి దూరమవుతుందని హోమియోపతి సీనియర్ మెడికల్ ఆఫీసర్(ఎస్ఎంవో) డా.నర్మదషిండే తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయుష్ శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు డే టు డే కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డిలోని ఇంద్రనగర్ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో మంగళవారం యోగాపై ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యునాని మెడికల్ ఆఫీసర్ డా.సమీనా, హోమియోపతి ఫార్మసిస్ట్ ఎన్. రమేశ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే రామాయంపేట మున్సిపల్ కార్యాలయంలో ఆయుష్‌శాఖ ఆధ్వర్యంలో యోగా శిక్షకుడు భరత్ ఆధ్వర్యంలో యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ పీ.దేవేందర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైనందిన జీవితంతో యోగాను భాగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ శ్రీనివాస్, వార్డ్ ఆఫీసర్లు, వాలంటీర్లు, మెప్మా ఆర్పీలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నవభారత నిర్మాత జవహర్‌లాల్ నెహ్రూ



జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న హనుమంతరావు

మెదక్ అర్బన్, మే 27 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య సమరయోధులు, భారత తొలి ప్రధాని, నవభారత నిర్మాత భారతరత్న స్వర్గీయ జవహర్ లాల్ నెహ్రూ అని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు కొనియాడారు. మంగళవారం మెదక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యా లయంలో నెహ్రూ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కాంగ్రెస్ అభివృద్ధి కోసం మండల కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు హనుమంతరావు తెలిపారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో ఫిషరీస్ చైర్మన్, కమిటీ అబ్జర్వర్ మెట్టు సాయికుమార్, జాతీయ కార్యదర్శి వరప్రసాద్ సమక్షంలో వివిధ మండలాలకు సంబంధించిన కమిటీ నాయకుల పేర్ల జాబితాను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అంజనేయులుగౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, నాయకులు బొజ్జపవన్, సుప్రబాత్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హఫీజ్, పాల్గొన్నారు. అలాగే నర్సాపూర్‌లో నెహ్రూ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గుప్తా, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు డి.అంజిగౌడ్, మాజీ ఎంపీటీసీలు అశోక్, నగేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉదయ్ పాల్గొన్నారు.

నిబంధనల మేరకే నిర్మాణాలు చేపట్టాలి

జహీరాబాద్, మే 27 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిబంధనల మేరకు లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా పేర్కొన్నారు. మంగళవారం మొగుడంపల్లి మండల పరిధిలోని జాంగారిబోలి తండా, తదితర ప్రాంతాల్లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు. గృహ నిర్మాణశాఖ అధికారులు సూచించిన మేరకే ఇళ్లను నిర్మించాలని, కొలతల్లో తేడాలు వస్తే ఇందిరమ్మ ఇల్లుగ పరిగణించబోమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో మహేష్, పంచాయతీ కార్యదర్శులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సరఫరా చేయాలి

- కలెక్టర్‌కు మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి విజ్ఞప్తి

మెదక్ మున్సిపాలిటీ, మే 27 (ఆంధ్రజ్యోతి) : వానాకాలం ప్రారంభమైన దృష్ట్యా ముందస్తుగానే వర్షాలు కురుస్తున్నందున రైతులకు సకాలంలో ఎరువులు, నాణ్యమైన విత్తనాలు అందించేందుకు కలెక్టర్ రాహుల్‌రాజ్ కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాంత పరిధిలోని రైతులకు సరిపడా విత్తనాలు, ఎరువుల సరఫరా విషయంలో శ్రద్ధ వహించాలని కోరారు. వ్యవసాయ శాఖ, సీడ్ డెవలప్‌మెంట్ అధికారులను సమన్వయం చేసి కలెక్టర్ యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు దుకాణాల్లో నిలువలను రైతులకు అందుబాటులో ఉండేటట్లు చూడాలని విజ్ఞప్తి చేశారు.

శానిటేషన్‌పై స్పెషల్ డ్రైవ్ : ఎమ్మెల్యే

మెదక్ అర్బన్, మే 27(ఆంధ్రజ్యోతి): రానున్న వర్షాకాలంలో దృష్టిలో పెట్టుకొని శానిటేషన్‌పై స్పెషల్ డ్రైవ్ చేపడతామని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ప్రజలకు కీటక, జనిత వ్యాధులు, మలేరియా, డెంగ్యూ, విష జ్వరాలు సోకకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామన్నారు. మెదక్, రామాయంపేట మున్సిపాలిటీల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు చెప్పారు. పర్యవేక్షణ బాధ్యత మెదక్ ఆర్డీవో రమాదేవికి ప్రత్యేక బాధ్యతలు అప్పగించామని ఎమ్మెల్యే వెల్లడించారు.

డీఎస్పీకి సన్మానం



సైదానాయక్‌ను సన్మానిస్తున్న బంజారా సంఘం నాయకులు

జహీరాబాద్, మే 27 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ డీఎస్పీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సైదానాయక్‌ను ఆలిండియా బంజారా సేవాసంఘం నాయకులు మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్ మాట్లాడుతూ సైదానాయక్ గతంలో జహీరాబాద్ ఎస్ఐగా పనిచేసిన సమయంలో ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. జహీరాబాద్‌కు మరోమారు డీఎస్పీగా రావడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బంజారా సంఘం నాయకులు మోతీరాం(మాజీ కౌన్సిలర్), రాంచందర్ పాల్గొన్నారు.

పిల్లలందరినీ ప్రభుత్వ బడుల్లో చేర్పించాలి



నారాయణఖేడ్: జీపు జాతలో మాట్లాడుతున్న ఎంఈవోలు

నారాయణఖేడ్/పుల్కల్/గుమ్మడిదల, మే 27 (ఆంధ్రజ్యోతి): బడి ఈడు పిల్లలందరినీ సర్కార్ బడుల్లోనే చేర్పించాలని నారాయణఖేడ్, మనూరు, నాగల్‌గిద్ద ఎంఈవోలు విశ్వనాథ్, రాజశేఖర్, మన్మథకిషోర్ సూచించారు. మంగళవారం ఖేడ్‌లో టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో బడి పిల్లల నమోదు కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కంబాపురం అశోక్ మాట్లాడుతూ తమ సంఘం ఉపాధ్యాయుల హక్కులకే కాకుండా విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నరేష్, ఏశప్ప, నర్సయ్య, హరీసింగ్ తదితరులు పాల్గొన్నారు. పుల్కల్ మండలంలోని ఉప్పరిగూడెంలో చౌటకూర్ కేంద్ర ప్రాథమిక పాఠశాల ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం గాజుల సుభాష్‌బాబు ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే గుమ్మడిదలలో బడిబాట కార్యక్రమాన్ని టీఎస్‌యూటీఎఫ్ సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బీ.సాయిలు ప్రారంభించారు.

భగలాముఖి సన్నిధిలో అమావాస్య పూజలు

శివ్వంపేట, మే 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన శివ్వంపేటలో కొలువైన శక్తి పీఠం భగలాముఖి అమ్మవారి సన్నిధిలో మంగళవారం అమావాస్య పురస్కరించుకొని ఆలయ వ్యవస్థాపకుడు వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, విశేష పూజలు, యాగశాలలో మహా మంత్రహవనం నిర్వహించారు. నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

పెండింగ్ బిల్లులు ఇవ్వమంటే అరెస్టులా..?

- సర్పంచుల ఫోరం మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్

రేగోడు/పెద్దశంకరంపేట/చిన్నశంకరంపేట, మే 27 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్ బిల్లులు ఇవ్వమంటే అరెస్టులా..? అని సర్పంచుల ఫోరం మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ ప్రశ్నించారు. గ్రామపంచాయతీ పెండింగ్ బిల్లుల కోసం చలో సెక్రటేరియట్ ముట్టడికి పిలుపునివ్వడంతో సర్పంచులను ముందస్తు అరెస్ట్ చేశారని మండిపడ్డారు. అరెస్టు చేసిన వారిలో సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు రవీందర్, మాజీ సర్పంచ్ నర్సింలు, బీఆర్ఎస్ నాయకులు గురునాథ్‌రెడ్డి, సురేందర్, మహమ్మద్ బాబా తదితరులు ఉన్నారు. పెద్దశంకరంపేట మండల పరిధిలోని ఉత్తులూరు, బద్దారం, వీరోజిపల్లి, మాడ్వేట్‌పల్లి గ్రామాలకు చెందిన మాజీ సర్పంచులు శంకర్‌గౌడ్, విఠల్‌గౌడ్, రవీందర్, అశోక్, తదితరులను పోలీసులు అరెస్టు చేశారు. చిన్న శంకరంపేటలో మాజీ సర్పంచులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీలతస్వామిరాజ్, తదితరులను అరెస్ట్ చేశారు. సర్పంచులను అరెస్ట్ చేయడం దారుణమని సర్పంచుల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు యాదగిరియాదవ్ అన్నారు.

బిఖ్యాతండాలో తాగునీటి సమస్య



ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న గిరిజనులు

శివ్వంపేట, మే 27 (ఆంధ్రజ్యోతి) : తాగునీటి సమస్య పరిష్కరించాలని శివ్వంపేట మండలం బిఖ్యాతండావాసులు మంగళవారం ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ ఐదురోజులుగా మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో పాటు సింగిల్ ఫేజ్ మోటారు లేక తీవ్ర అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శికి చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోయారు. కేబుల్ వైరు ఇప్పించమని అడిగితే డబ్బులు లేవని సమాధానం చెబుతున్నాడని వాపోయారు. అధికారులు స్పందించి తండాకు ట్రాక్టర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని కోరుతున్నారు.

పార్కుల్లో మౌలిక సదుపాయాలకు కృషి

రామచంద్రాపురం టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి) : పార్కుల్లో మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ పుష్పానగేష్ అన్నారు. మంగళవారం రామచంద్రాపురం డివిజన్ పరిధి శ్రీనివాస్‌నగర్ బాలవిహార్ పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులు పరిశీలించారు. అన్నివర్గాల వారికి ప్రయోజనకరం కల్పించేరీతిలో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఓపెన్‌జిమ్, చిన్నారులు ఆడుకోవడానికి అన్ని పరికరాలు ఏర్పాట్లు చేసామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మల్లేష్, ఐలేష్, శ్రీకాంత్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'సబ్సిడీలు అర్హులకు అందేలా కృషి చేయాలి'

జిన్నారం, మే 27 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ రంగం, రైతులకు ప్రభుత్వం అందించే పథకాలు, సబ్సిడీలు అర్హులందరికీ దక్కేలా కృషి చేయాలని ఆత్మ కమిటీ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిన్నారం మండలం సోలక్‌పల్లి రైతువేదికలో నియోజకవర్గస్థాయి ఆత్మ కమిటీ మొదటి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఏడీఏ మనోహర, ఐదు మండలాల వ్యవసాయ శాఖ అధికారులు, విస్తీర్ణ అధికారులు, కమిటీకి చెందిన 24 మంది డైరెక్టర్లు పాల్గొన్నారు.

'బుద్ధుడి విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని అరెస్ట్ చేయాలి'

నారాయణఖేడ్, మే 27 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అబ్బెందలో బుద్ధుడి విగ్రహాన్ని ధ్వంసం చేసి తల, చెయ్యి తొలగించిన నిందితులను ప్రభుత్వం వెంటనే అరెస్టు చేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఖేడ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద దీక్షలు చేపట్టగా.. కేవీపీఎస్ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొటారి నర్సింలు మాట్లాడుతూ అబ్బెందలో బుద్ధుడి విగ్రహాన్ని ధ్వంసం చేసి 45 రోజులు కావస్తున్నా నిందితులను అరెస్టు చేయకపోవడం దారుణమన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో 8 మంది డిబార్

సంగారెడ్డి అర్బన్, మే 27 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో మంగళవారం జరిగిన ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఎనిమిది మంది డిబార్ అయ్యారు. మధ్యాహ్నం జరిగిన సెకండియర్ పరీక్షల్లో సదాశివపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఐదుగురు, బుదేరా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ముగ్గురు మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడ్డారు. కాగా సెకండియర్ కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షకు 1,606 మందికి 1,487 మంది హాజరుకాగా 119 మంది గైర్హాజరయ్యారని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవిందరామ్ తెలిపారు.

భవనం పైనుంచి పడి బాలుడు మృతి

పటాన్‌చెరు రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి) : భవనం పైనుంచి పడి బాలుడు మృతిచెం దిన ఘటన బీడీఎల్ చోటు చేసుకుంది. మధ్యప్రదేశ్‌కు చెందిన రూప్‌చంద్ భార్య సత్యశీల, ముగ్గురు పిల్లలతో కలిసి వెలమెల సమీపంలోని అభినందన కనస్ట్రక్షన్‌లో మేస్త్రీ పనిచేసుకుంటూ అక్కడే క్యాంపులో ఉంటున్నాడు. సోమవారం నిర్మాణ దశలో ఉన్న భవనం వద్దకు చిన్న కుమారుడు లవ్(3)ను తీసుకొని వెళ్లాడు. మూడో అంతస్తులో భార్యాభర్తలు పని చేస్తుండగా లవ్ ఆడుకుంటూ మూడో అంతస్తుపై నుంచి కిందపడ్డాడు. దీంతో తీవ్ర గాయాలైన బాలుడిని చికిత్స కోసం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. బాలుడి తండ్రి రూప్‌చంద్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డీసీఎం బోల్తా, ఒకరికి గాయాలు

రేగోడు, మే 27 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం లోడుతో వెళ్తున్న డీసీఎం అదుపుతప్పి బోల్తాపడడంతో ఒకరికి గాయాలైన సంఘటన రేగోడు మండలంలోని చౌదరిపల్లిలో సోమవారం రాత్రి జరిగింది. చౌదరిపల్లిలో ఐకేపీ ద్వారా కొనుగోలు చేస్తున్న ధాన్యాన్ని డీసీఎంలో లోడ్ చేసుకుని వెంకటాపూర్ చౌరస్తాలో ఉన్న రైస్‌మిల్‌కు తరలిస్తుండగా అదుపుతప్పి బోల్తా పడింది. ఆ సమయంలో డ్రైవర్ తప్ప ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పిందని స్థానికులు తెలిపారు. డ్రైవర్ జైపాల్‌కు స్వల్పగాయాలు కాగా నారాయణఖేడ్ ఆస్పత్రికి తరలించారు.

యువతి అదృశ్యం



నాగమణి(ఫైల్)

నర్సాపూర్, మే 27 (ఆంధ్రజ్యోతి) : యువతి అదృశ్యమైన సంఘటన నర్సాపూర్ మండలం బ్రాహ్మణపల్లిలో చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన గుండని నాగమణి నర్సాపూర్‌లోని ఓ స్టీల్ షాపులో మూడేళ్లుగా పనిచేస్తున్నది. అయితే నెలరోజులుగా పనికి వెళ్లకుండా ఇంటి వద్దే ఉంటుంది. సోమవారం మధ్యాహ్నం పనిచేసిన చోట డబ్బులు తీసుకొచ్చుకునేందుకు నర్సాపూర్‌కు వెళ్లింది. రాత్రయినా రాకపోవడంతో ఫోన్‌చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో తండ్రి యాదయ్య మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లింగం తెలిపారు.

రోడ్డు పక్కకు ఒరిగిన లారీ

రేగోడు, మే 27 (ఆంధ్రజ్యోతి) : రేగోడు-మర్పల్లి మధ్య బ్రిడ్జి నిర్మాణం కోసం వదిలేసిన రోడ్డులో మంగళవారం ఓ లారీ పక్కకు దూసుకుపోయింది. డ్రైవర్ అప్రమత్తతో పెద్ద ప్రమాదమే తప్పిందని స్థానికులు తెలిపారు. రేగోడు-మర్పల్లి మధ్య బ్రిడ్జి నిర్మాణం కోసం వదిలేసిన రోడ్డుతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు 8 ఏళ్లుగా బ్రిడ్జి నిర్మించకపోగా రోడ్డుకు మరమ్మతులు చేయడం లేదు. చిన్న వర్షం పడిన రోడ్డుపై ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు. ఇటీవలే మంత్రి దామోదర్ రాజనర్సింహ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేసినా పనులు చేపట్టడం లేదని విమర్శలు ఉన్నాయి.

ఔత్సాహికులను ప్రోత్సహించడానికే శిక్షణ

- బీవీఆర్ఐటీ ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె

నర్సాపూర్, మే 27 (ఆంధ్రజ్యోతి) : సౌరశక్తి నిర్వహణపై ఔత్సాహికులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో వారంరోజుల ఉచిత శిక్షణ చేపట్టినట్లు బీవీఆర్ఐటీ కాలేజీ ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె పేర్కొన్నారు. మంగళవారం కాలేజీలోని ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ విభాగంతోపాటు ఎస్బీ అండ్ పీఈఎస్ సొసైటీ భాగస్వామ్యంతో ఐటీఐ, డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈఈఈ అసోసియేట్ ప్రొఫెసర్ చంద్రబాబు, హెచ్‌వోడీ రాయుడు, మేనేజర్ బాపిరాజు, ఏఏవో సురేష్ పాల్గొన్నారు.

భూ వివాదంలో గడ్డపారతో దాడి

శివ్వంపేట్, మే 27(ఆంధ్రజ్యోతి): భూ సరిహద్దు వివాదంలో గడ్డపారతో దాడిచేయగా ఒకరు స్పృహ కోల్పోవడంతో ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన ఉసిరికపల్లి రెవెన్యూ పరిధి శంకర్‌తండాలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని భీమ్లాతండా పంచాయతీ పరిధిలోని శంకర్‌తండాలో కేతావత్ బాలు, పాతులోతు రవీందర్ మధ్య భూ సరిహద్దు వివాదం నెలకొన్నది. రవీందర్ 13 గుంటల భూమిని మరో వ్యక్తికి విక్రయించాడు. ఇందుకు సంబంధించి మంగళవారం భూ సరిహద్దులు ఏర్పాటు చేస్తుండగా బాలు, రవీందర్ మధ్య వివాదం చోటు చేసుకున్నది. ఈ క్రమంలో రవీందర్‌ను బాలు గడ్డపారతో కడుపులో దాడిచేయడంతో రవీందర్ స్పృహ కోల్పోయాడు. వెంటనే తూప్రాన్ ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు రవీందర్ తెలిపారు. కాగా స్థానిక నాయకుల ప్రమేయంతోనే భూ వివాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు ఆరోపించారు.

కొబ్బరికాయ వేలం రూ.13 లక్షలు

శివ్వంపేట, మే 27 (ఆంధ్రజ్యోతి) : స్వయంభుగా వెలసిన పుణ్యక్షేత్రం చిన్న గొట్టిముక్ల గ్రామం పరిధిలోని చాకరిమెట్ల సహకార ఆంజనేయ స్వామి సన్నిధిలో మంగళవారం ఆలయ చైర్మన్ ఆంజనేయశర్మ, ఈవో సార శ్రీనివాస్ ఆధ్వర్యంలో కొబ్బరికాయ పూజ సామగ్రి విక్రయం కోసం బహిరంగ వేలం నిర్వహించారు. వేలంలో ముగ్గురు పాల్గొనగా చిన్న గొట్టిముక్లతండాకు చెందిన పాత్‌లోత్ హరిసింగ్‌నాయక్ రూ.13 లక్షలకు దక్కించుకున్నాడు. దేవాదాయశాఖ ఆదేశాల మేరకు కొబ్బరికాయ రూ.30కి విక్రయించాలని ఈవోసార శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చాకరి మెట్ల జూనియర్ అసిస్టెంట్ రామకృష్ణ, తునికి ఆలయ జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.